# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 22-12-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ కువైట్ ప్రభుత్వం ఆ దేశ అత్యున్నత గౌరవమైన ఆర్డర్ ఆఫ్ ముబారక్ అల్ కబీర్ ని ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ప్రదానం చేసింది.
- ❖ త్రిపుర రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని హోం మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు.
- ❖ "ఫిట్ ఇండియా" ప్రచారంలో దేశ ప్రజలు భాగస్వాములు కావాలని క్రీడల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ పిలుపునిచ్చారు.
- ❖ పర్యావరణ హితమైన విద్యుత్ ప్రాజెక్టులను కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని కేంద్రమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ తెలిపారు.
- ❖ ప్రముఖ క్షేత్రమైన పూరీ జగన్నాథ ఆలయంలో జనవరి ఒకటవ తేదీ నుంచి నూతన దర్శన విధానాన్ని అమలు చేయనున్నారు.

========================

కువైట్ ప్రధానమంత్రి షేక్ అహ్మద్ అల్ అబ్దుల్లా అల్ అహ్మద్ అల్ సబాను భారత దేశానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆహ్వానించారు. కువైట్ పర్యటనలో ఉన్న ప్రధానమంత్రి ఈ రోజు షేక్ అహ్మద్ అల్ అబ్దుల్లాతో సమావేశమయ్యారు. రాజకీయ, వాణిజ్య, ఇంధన, రక్షణ, భద్రత, ఆరోగ్యం, విద్య, సాంకేతికత, సాంస్కృతిక భాగస్వామ్యాలపై చర్చ జరిగింది. రెండు దేశాల మధ్య ఆర్థిక సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని ఈ సమావేశంలో ఇరు దేశాల అధినేతలు నిర్ణయించారు. ఇదిలా ఉండగా కువైట్ లోని ప్రవాస భారతీయుల సమావేశంలో ఇతర దేశాలలో ఉన్న భారతీయుల మూలంగా భారత్ ఈ రోజు ప్రపంచంలో కీలక భూమిక పోషిస్తోందని నరేంద్ర మోడీ పేర్కొంటూ...

(వాయిస్ 22 సెకన్లు)

కాగా కువైట్ ప్రభుత్వం ఆ దేశ అత్యున్నత గౌరవమైన "ఆర్డర్ ఆఫ్ ముబారక్ అల్ కబీర్"ని నరేంద్ర మోడీకి ప్రదానం చేసింది.

=========================

“ఫిట్ ఇండియా” ప్రచారంలో దేశ ప్రజలు భాగస్వాములు కావాలని కేంద్ర క్రీడల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ పిలుపు ఇచ్చారు. న్యూఢిల్లీలో ఈ రోజు  జరిగిన 'ఫిట్ ఇండియా సండే ఆన్ సైకిల్' తొలి కార్యక్రమంలో సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్పీఎఫ్), ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ) జవాన్లతో కలిసి ఆయన  పాల్గొన్నారు. మేజర్ ధ్యాన్ చంద్ నేషనల్ స్టేడియం నుంచి రైసినా హిల్స్ వరకు జవాన్లతో పాటు కేంద్ర మంత్రి పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు ఫిట్ ఇండియా ప్రచారాన్ని దేశవ్యాప్తంగా వెయ్యికి పైగా ప్రాంతాలలో నిర్వహించనున్నామని తెలిపారు.

=========================

త్రిపురలో మూడు రోజుల పర్యటనలో భాగంగా  కేంద్ర హోంమంత్రి అమిత్ షా 668.39 కోట్ల రూపాయల విలువైన 13 ప్రాజెక్టులకు ఈ రోజు శంకుస్థాపన చేశారు ధలై జిల్లా హదుక్లావ్ లోని నిర్వాసిత కుటుంబాల శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ వారితో  సంభాషించిన ఆయన ఆయుష్మాన్ భారత్ కార్డు లేని వారికి త్వరలో కార్డులు లభిస్తాయని హామీ ఇచ్చారు. అనంతరం ధలై జిల్లాలోని మసురాయ్ పారాలో జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతూ... రాష్ట్రంలో వివిధ జిల్లాల్లోని 11 గ్రామాల్లో బ్రూ నిర్వాసితులకు పునరావాసం కల్పించేందుకు ప్రభుత్వం 900 కోట్ల రూపాయలు ఖర్చు చేసిందన్నారు.  విద్యుత్ లైన్లు, అంతర్గత రోడ్ల నిర్మాణం, తాగునీటిని అందించేందుకు ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందని అమిత్ షా పేర్కొంటూ...

(వాయిస్ 38 సెకన్లు)

=========================

ప్రముఖ క్షేత్రమైన పూరీ జగన్నాథ ఆలయంలో వచ్చే సంవత్సరం జనవరి ఒకటవ తేదీ నుంచి నూతన దర్శన విధానాన్ని అమలులోకి తీసుకువస్తామని ఒడిశా రాష్ట్ర న్యాయశాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ ఈ రోజు పాత్రికేయులకు తెలిపారు.  కొత్త విధానానికి సంబంధించిన ఏర్పాట్లు  ఈ నెల 27, 28 తేదీల్లోగా పూర్తవుతాయన్నారు. ఈ కొత్త విధానంలో ఆలయానికి వచ్చే మహిళలు, పిల్లలు, వికలాంగులు, వృద్ధుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఈ విధానం వల్ల భక్తులు ప్రస్తుతం ఉన్న ద్వారం నుండి జగన్నాథ ఆలయంలోకి ప్రవేశిస్తారు.

విరామం

=========================

కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి ఎస్. జైశంకర్ శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి నేషనల్ ఎమినెన్స్ అవార్డు అందుకున్నారు. ప్రజా నాయకత్వం విభాగంలో సౌత్ ఇండియన్ ఎడ్యుకేషన్  సొసైటీ (SIES) ఆయనకు ఈ పురస్కారం ప్రదానం చేసింది. ఈ సందర్భంగా  జైశంకర్ మాట్లాడుతూ... దేశంలోని పురాతన విద్యా సంఘాలలో ఒకటైన ఎస్.ఐ.ఈ.ఎస్. తనకు ఈ అవార్డు అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

=========================

కేరళ పర్యటనలో ఉన్న కేంద్ర విద్యుత్, గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ ఆ రాష్ట్రంలో అమలవుతున్న వివిధ విద్యుత్, పట్టణ వ్యవహారాల ప్రాజెక్టులపై ఈ రోజు సమీక్ష నిర్వహించారు. తిరువనంతపురంలో జరిగిన ఈ సమావేశంలో కేంద్ర పెట్రోలియం, సహజవాయువు శాఖ సహాయ మంత్రి సురేష్ గోపి, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి కె.కృష్ణన్ కుట్టి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ...

రాష్ట్రంలో హైడ్రో ప్రాజెక్టులతో పాటు అణు విద్యుత్ కేంద్రాల రూపకల్పనకు ప్రణాళికలు రూపొందించామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాలను కేరళలో పూర్తిగా అమలు చేస్తామని మనోహర్ లాల్ ఖట్టర్ పేర్కొంటూ..

(వాయిస్ 32 సెకన్లు)

========================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్ - మనసులోని మాట" కార్యక్రమం 117వ సంచిక ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. “మన్ కీ బాత్” కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్ కు ఈనెల 27వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

========================

"ఉడాన్ యాత్రి కేఫ్" అవుట్ లెట్ ను కోల్ కతా విమానాశ్రయంలో ప్రయోగాత్మకంగా ప్రారంభించినట్లు పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ప్రకటించింది. విమాన ప్రయాణికులకు సరసమైన ధరలకు ఆహారం, నీరు వంటి ప్రాథమిక నిత్యావసరాలను అందించడానికి విమానాశ్రయంలో "ఉడాన్ యాత్రి కేఫ్” ను ఏర్పాటు చేశారు. ఈ ప్రయోగం విజయవంతమైతే ఎయిర్ పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలోని దేశంలోని ఇతర విమానాశ్రయాల్లోనూ అమలు చేస్తామని  అధికార వర్గాలు తెలిపాయి.

========================

వినియోగదారులను మరింత  చైతన్యవంతం చేసే లక్ష్యంతో ఈ నెల 24వ తేదీన “జాతీయ వినియోగదారుల దినోత్సవం 2024”ని దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నామని కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ పేర్కొంది. ఈ సందర్భంగా “జాగో గ్రాహక్ జాగో” యాప్, జాగృతి యాప్, జాగృతి డ్యాష్ బోర్డులను ప్రారంభించనుంది. “జాగో గ్రాహక్ జాగో” యాప్ వినియోగదారుడి ఆన్ లైన్ కార్యకలాపాల సమయంలో మోసాలు లేకుండా అవగాహన కలిగించి, అప్రమత్తం చేస్తుందని ఆ శాఖ తెలిపింది

========================

దేశవ్యాప్తంగా చలి తీవ్రత పెరిగిందని భారత వాతావరణ శాఖ (ఐఎండి) తెలిపింది. దేశ రాజధాని ఢిల్లీతో పాటు ఉత్తర భారతదేశంలో చలి అధికంగా ఉందని పేర్కొంది. ఢిల్లీ నగరాన్ని దట్టమైన పొగమంచు ఆవరించింది అని పేర్కొంది.  ఈ రోజు ఢిల్లీలో ఉదయం 5 గంటల 30 మినిషాలకు కనిష్ట ఉష్ణోగ్రత 8 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. కాగా, జమ్ముకాశ్మీర్‌లో ఉష్ణోగ్రతలు మైనస్ డిగ్రీలకు పడిపోయాయి. శ్రీనగర్‌లో ఈ రోజు  ఉదయం 8 గంటల 30 నిమిషాల ప్రాంతంలో -3.2 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. దాల్ సరస్సు గడ్డ కట్టిందని ఐఎండి తెలియజేసింది.

========================
========================